W W W.EPAPER.MAHADAILY.COM

# మహా పత్రిక

26-3-2026 వరంగల్










03

## పెట్రోల్, డీజిల్‌కు కొరత లేదు

వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పెట్రోల్, డీజిల్ కొరత లేదని వరంగల్ సీపీ స్పష్టం చేశారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న వదంతుల వల్ల ప్రజలు ఆందోళనకు గురై ఒకేసారి పెద్ద సంఖ్యలో పెట్రోల్ బంకులకు వెళ్లి వాహనాల్లో ఫుల్ ట్యాంక్ నింపించు కుంటున్నారని తెలిపారు.

# 26-2027 బల్దియా బడ్జెట్

# రూ.1040.58 కోట్లు

## బడ్జెట్‌ను ఆమోదించిన బల్దియా కౌన్సిల్

### ఇంచార్జ్ కమిషనర్‌ను సత్కరించిన మేయర్, కార్పొరేటర్లు

వరంగల్ మహా నగర పాలక సంస్థకు సంబంధించి 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను ముసాయిదా బడ్జెట్ సమావేశం బుధవారం వాడి వేడిగా సాగింది. మొదటగా ఆయా డివిజన్ల లోని స్థానిక సమస్యల పై చర్చించాలని బిజెపి, బిఆర్ఎస్ పార్టీల కార్పొరేటర్లు పోడియం ముందు నినాదాలు చేయగా సమస్యల పై తదుపరి సమావేశంలో మాట్లాడదామని మేయర్ సర్ది చెప్పడంతో ఆందోళన విరమించారు. అనంతరం రూ.1040కోట్ల 58 లక్షల 75 వేల అంచనాలను మేయర్ గుండు సుధారాణి అధ్యక్షతన పాలక వర్గం ఆమోదించింది.





మహా, వరంగల్ బ్యూరో

03



06

## పన్ను వసూళ్లలో బల్దియా సిబ్బంది తిప్పలు

వరంగల్ నగరంలోని కొత్తవాడ ప్రాంతంలో మున్సిపల్ సిబ్బందిపై దాడి జరిగిన ఘటన వెలుగులోకి వచ్చింది. స్థానికంగా నివసిస్తున్న బొట్ల శ్రవణ్ అనే వ్యక్తిపై ఉన్న ఇంటి పన్ను విషయం పై అతని తండ్రి ఆశీర్వాదం ఇంటికి చెందిన రూ.12 వేల హౌస్ ట్యాక్స్ బకాయిలు ఉండటం తో, మున్సిపల్ సిబ్బంది వసూళ్ల కోసం అక్కడికి వెళ్లారు.ఈ సందర్భంగా ఆశీర్వాదం సిబ్బంది పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ అసభ్యకరంగా మాట్లాడు తూ సిబ్బందిపై దుర్భాషలాడినట్లు తెలిసింది.



06

## చికెన్ షాపులు బంద్

పౌల్ట్రీ కంపెనీల విధానాలకు వ్యతిరేకంగా తెలంగాణ రాష్ట్రంలో చికెన్ వ్యాపారులు ఆందోళనకు దిగుతున్నారు. తక్కువ మార్జిన్ కారణంగా నష్టాలు ఎదుర్కొంటు న్నామని పేర్కొంటూ, ఏప్రిల్ 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా చికెన్ షాపులను బంద్ చేయాలని నిర్ణయించారు. పౌల్ట్రీ కంపెనీలు ఇచ్చే మార్జిన్ సరిపోవడం లేదని వ్యాపారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో వ్యాపారం నష్టాల్లోకి వెళ్లే పరిస్థితి ఏర్పడిందని వారు చెబుతున్నారు. చికెన్ ధరలు పెరిగినా, మధ్యవర్తుల విధానాల వల్ల తాము లాభపడడం లేదని వ్యాపారులు వాపోతున్నారు.

# వరంగల్ డీసీసీ బ్యాంకులో మత వివక్షత

## సీఈవో పై హన్మకొండ జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు

## రాష్ట్రీయ హిందూ పరిషత్ మండల భూపాల్

**హనుమకొండ, మహా:** రాష్ట్రీయ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో వరంగల్ డీసీసీ బ్యాంకు ఉద్యోగుల పై జరుగుతున్న మత వివక్షత పై బుధవారం హనుమకొండ జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. పూర్తి వివరాల్లోకి వెళితే.. వరంగల్ డీసీసీ బ్యాంక్ సీఈవో వాజీర్ సుల్తాన్ తన అధికార దుర్వినియోగంతో బ్యాంకు ఉద్యోగుల మధ్య హిందూ, ముస్లిం అనే మత ప్రాతిపదికన విభజన సృష్టిస్తున్నారని ముఖ్యంగా హిందూ పండగల సమయం లో సెలవులు కేటాయించకపోగా అందరికీ సాధారణ సెలవు అమలు చేయగా, రంజాన్ సందర్భంగా హిందూ ఉద్యోగులకు విధులు కేటాయించి, ముస్లిం ఉద్యోగులకు మాత్రమే సెలవు కొనసాగించడం వంటి వివక్షత చర్యలు చేపడుతున్నారని రాష్ట్రీయ హిందూ పరిషత్ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ మండల భూపాల్ జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. అలాగే హిందూ ఉద్యోగులు తమ తీర్థయాత్రల కోసం సెలవులు కోరినపుడు నిరాకరించడం, ముస్లిం ఉద్యోగులకు మాత్రం తక్షణమే సెలవులు మంజూరు చేయడం వంటి అంశాల పై ఉద్దేశపూర్వకంగానే మత వివక్షత చూపుతున్నారని తెలిపారు. ఉద్యోగులను మతాల వారీగా విడదీసి విధులు కేటాయించడం, హిందూ ఉద్యోగుల పై దురుసుగా ప్రవర్తించడం, ప్రశ్నిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటానని, సస్పెండ్ చేస్తానని బెదిరించడం జరుగుతోందని తెలిపారు. ఈ విధమైన చర్యల వల్ల ఉద్యోగులు మానసిక ఆందోళనకు గురవుతూ



భయాందోళనల మధ్య విధులు నిర్వహిస్తున్నారని వారు పేర్కొన్నారు. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణలోకి తీసుకొని, ప్రభుత్వ కార్యాలయాల్లో మత వివక్షత లేకుండా అందరూ సమానంగా పనిచేసే వాతావరణాన్ని కల్పించాలని, సంబంధిత అధికారి పై తక్షణమే విచారణ జరిపి తగిన శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు పత్రంలో జిల్లా కలెక్టర్ ను మండల భూపాల్ కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ హెచ్ పి దేవాలయ పరిరక్షణ సమితి అధ్యక్షులు చీకటి రాజు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మడిపోజు సంతోష్ , ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షులు పల్లపు అశోక్ , కోర్ కమిటీ సభ్యులు కలకోటి శ్రీధర్ , జంగం ఈశ్వర ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



# మాతృత్వం ఒక వరం

## హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్

**హనుమకొండ మహా:** మాతృత్వం ఒక వరమని, దానికి చట్టబద్ధమైన దత్తత మార్గమే శ్రేయస్కరమని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయ్ అన్నారు. బుధవారం కంచరకుంట లోని మహిళాభివృద్ధి , శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోని ప్రత్యేక దత్తత విభాగాన్ని సందర్శించిన కలెక్టర్, కేంద్ర దత్తత వనరుల ప్రాధికార సంస్థ నిబంధనల ప్రకారం ఎంపికైన శిశువును హనుమకొండ జిల్లా వడ్డేపల్లికి చెందిన దంపతులకు దత్తతగా అప్పగించారు. ఆ దంపతులు నాలుగు సంవత్సరాల క్రితం దరఖాస్తు చేసుకున్నట్లు, సీనియారిటీ ఆధారంగా నాలుగు నెలల శిశువును దత్తతగా అందజేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అక్రమ దత్తత చట్టవిరుద్ధమని, అలాంటి చర్యలకు పాల్పడకూడదని సూచించారు. ప్రతి దత్తత కూడా కేంద్ర దత్తత వనరుల ప్రాధికార సంస్థ నిబంధనలకు అనుగుణంగా జరగాలని పేర్కొన్నారు.జిల్లా సంక్షేమ అధికారి ఎం. విశ్వజ మాట్లాడుతూ, ప్రత్యేక దత్తత విభాగం ద్వారా 2007 సంవత్సరం నుండి ఇప్పటివరకు దేశీయ దత్తత కింద 220 మంది పిల్లలను, విదేశీ దత్తత కింద అమెరికా, మాల్టా, ఇటలీ, దుబాయి వంటి దేశాలకు 12 మంది పిల్లలను దత్తతగా ఇవ్వడం జరిగినట్లు తెలిపారు. కలెక్టర్ శిశు గృహంలో ఉన్న పిల్లలతో ముచ్చటించి, దత్తతకు అందజేయబడిన శిశువును ఎత్తుకొని ఆప్యాయంగా పలకరించి సంతోషం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు డాక్టర్ పరికి సుధాకర్, ఇంచార్జి జిల్లా శిశు పరిరక్షణ అధికారి ఎస్. ప్రవీణ్ కుమార్, ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎం మౌనిక, శిశు గృహ ఇన్‌చార్జి మేనేజర్ అనుముల మాధవి, సోషల్ వర్కర్ సంగి చైతన్య, నర్స్ పుల్ల మౌనిక , ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# జిల్లా సహకార కేంద్ర బ్యాంక్‌లో మహా జనసభ



**హనుమకొండ మహా:** వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ ప్రధాన కార్యాలయంలో హనుమకొండ జిల్లా కలెక్టర్ బ్యాంకు బాధ్యతల ఇన్‌చార్జి చాహత్ బాజ్ పాయ్ అధ్యక్షతన మహా జనసభ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, బ్యాంకు పరిపాలన నివేదికను 2025--26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన వివరాలను మహా జనసభ ముందుంచి ప్రవేశపెట్టినట్లు తెలిపారు. అలాగే రాబోయే ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బడ్జెట్ ప్రతిపాదనలు సభలో ప్రవేశపెట్టి ఆమోదం పొందినట్లు వెల్లడించారు. బ్యాంకు డిపాజిట్ సేకరణ, రుణ వితరణ లో నిర్దేశించిన లక్ష్యాలను సాధిస్తూ, లాభాల దిశగా ముందుకు సాగుతున్నదని తెలిపారు. రైతులకు సహకార సంఘాలకు సమయానికి రుణాలు అందజేసి వ్యవసాయ అభివృద్ధికి బ్యాంకు కట్టుబడి పనిచేస్తోందని పేర్కొన్నారు. పాక్స్ యాక్సిలరేటరీ కార్యక్రమం కింద నాబార్డ్ సహకారంతో నాలుగు సహకార సంఘాలకు డ్రోన్లు జనౌషధి కేంద్రాల స్థాపనకు తక్కువ వడ్డీ పై రుణాలు మంజూరు చేసినట్లు తెలిపారు. ఇదే మార్గంలో ఇతర సంఘాలు కూడా అభివృద్ధి కార్యక్రమాల్లో ముందుకు రావాలని సూచించారు. ఈ సందర్భంగా నాబార్డ్ జిల్లా అభివృద్ధి మేనేజర్ చంద్రశేఖర్ తో కలిసి రవి మాట్లాడుతూ, పాక్స్ యాక్సిలరేటరీ కార్యక్రమం ద్వారా సహకార సంఘాలను బలోపేతం చేయడం, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ప్రవేశపెట్టి రైతులకు మెరుగైన సేవలు అందించడం ముఖ్య ఉద్దేశ్యమని తెలిపారు. జిల్లా సహకార అధికారులు మాట్లాడుతూ, సహకార సంఘాల అభివృద్ధి కోసం బ్యాంకులు మరింత కృషి చేయాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో జిల్లా సహకార అధికారులు సంజీవరెడ్డి, నీరజ, వాల్య నాయక్, కోదండ రాములు, వరలక్ష్మి, రామ్మోహన్, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారులు, తోట పంటల శాఖ, మత్స్యశాఖ అధికారులు, సహకార సంఘాల ప్రతినిధులు, బ్యాంకు ముఖ్య కార్యనిర్వాహక అధికారి వజీర్ సుల్తాన్, ప్రధాన మేనేజర్ ఉషశ్రీ, ఉప ప్రధాన మేనేజర్ అశోక్, బ్యాంకు ప్రత్యేక విధుల అధికారి విజయ కుమారి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

FOLLOW: @ANNTELUGU
26-3-2026
WWW. EPAPER.MAHAADAILY.COM
వరంగల్
మహా పత్రిక
ANN తెలుగు

# 26-2027 బల్దియా బడ్జెట్ రూ.1040.58 కోట్లు

## బడ్జెట్ ను ఆమోదించిన బల్దియా కౌన్సిల్

## ఇంచార్జ్ కమిషనర్ ను సత్కరించిన మేయర్, కార్పొరేటర్లు

**మహా వరంగల్ బ్యూరో:** వరంగల్ మహా నగర పాలక సంస్థకు సంబంధించి 2026-27 ఆర్థిక సంవత్సరానికి గాను ముసాయిదా బడ్జెట్ సమావేశం బుధవారం వాడి వేడిగా సాగింది. మొదటగా ఆయా డివిజన్ల లోని స్థానిక సమస్యల పై చర్చించాలని బిజెపి, బిఆర్ఎస్ పార్టీల కార్పొరేటర్లు పోడియం ముందు నినాదాలు చేయగా సమస్యల పై తదుపరి సమావేశంలో మాట్లాడదామని మేయర్ సర్ది చెప్పడంతో ఆందోళన విరమించారు. అనంతరం రూ.1040కోట్ల 58 లక్షల 75 వేల అంచనాలను మేయర్ గుండు సుధారాణి అధ్యక్షతన పాలక వర్గం ఆమోదించింది. బల్దియా అకౌంట్స్ అధికారి శివ లింగం బడ్జెట్ అంచనాలను వెల్లడించగా మెజారిటి సభ్యులు అంగీకారం తెలపడంతో పాలక వర్గం బడ్జెట్ ను ఆమోదించింది. 2026--27 ఆర్థిక సంవత్సరానికి మొత్తం బడ్జెట్ కేటాయింపు రూ. 1,040 కోట్ల 58 లక్షల 75 వేలఅంచనాలతో రూపొందించి ఆమోదం పొందిన బడ్జెట్ లో ఛార్జ్డ్ వ్యయం రూ. 204.92 కోట్లు కాగా, ఇతర నిర్వహణ వ్యయం కోసం రూ. 67.96 కోట్లు కేటాయించబడింది. సాధారణ నిధి నుండి వివిధ అభివృద్ధి (మూలధన) పనుల కోసం రూ.75.55 కోట్లు ప్రతిపాదించగా, రూ. 75 లక్షలు మిగులు వ్యయం గా చూపించబడింది. అలాగే, మూలధన వ్యయం కోసం రూ. 691.40 కోట్లు కేటాయించడం జరిగింది. ఇందులో రూ.349 కోట్ల 19 లక్షలు సాధారణ పన్నుల ద్వారా, రూ.685 కోట్ల 20 లక్షలు వివిధ గ్రాంట్ల ద్వారా, రూ 620 కోట్లు డిపాజిట్లు, అడ్వాన్సుల ద్వారా సమకూరుతుందని అంచనా వేశారు. బల్దియా స్వంత ఆదాయం ద్వారా వచ్చే రూ. 349 కోట్ల 19 లక్షలలో 100 కోట్ల రూపాయలు సిబ్బంది జీత భత్యాలు, 40 కోట్ల 75 లక్షల 50 వేల రూపాయలు పారిశుద్ధ్య నిర్వహణకు, 29 కోట్ల 5 లక్షల రూపాయలు విద్యుత్ చెల్లింపులకు, 34 కోట్ల 91 లక్షల 88 వేల రూపాయలు గ్రీన్ బడ్జెట్ కు, 36 కోట్ల 15 లక్షల రూపాయలు ఇంజనీరింగ్ విభాగానికి, 30 కోట్ల 41లక్షల రూపాయలు సాధారణ నిర్వహణకు కోటి 40 లక్షల రూపాయలు టౌన్ ప్లానింగ్ కోసం కోటి 50 లక్షల రూపాయలు కేటాయించడం జరిగింది. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ముందుగా అందరికీ ముందస్తు శ్రీరామనవమి పర్వదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఆమోందించు కున్న 2026--27 ఆర్థిక సంవత్సర బడ్జెట్ వరంగల్ నగర భవిష్యత్తును నిర్మించే ఒక దిశానిర్దేశకంగా నిలుస్తుందని ముఖ్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దూరదృష్టి, అభివృద్ధి పట్ల





నిబద్ధతను ప్రత్యేకంగా అభినందించాల్సిందే అని గత మూడు దశాబ్దాలుగా పెండింగ్ లో ఉన్న అండర్ గ్రౌండ్ డ్రైనేజీ తో పాటు స్ట్రాం వాటర్ డ్రైన్ ప్రాజెక్టులకు రూ. 5,725.40 కోట్ల భారీ నిధులు మంజూరు చేసినందుకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఇందుకు సహకరించిన రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి ఉమ్మడి జిల్లాల ఇన్చార్జి మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, ధనసరి అనసూయ (సీతక్క), శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ , పార్లమెంటు సభ్యులు కడియం కావ్య , శాసన మండలి సభ్యులు బస్వరాజు సారయ్య , పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, ఎమ్మెల్యేలు నాయిని రాజేందర్ రెడ్డికి, కడియం శ్రీహరికి, రేవూరి ప్రకాశ్ రెడ్డి, కె.ఆర్ నాగరాజు వీరందరికీ వరంగల్ నగర ప్రజల తరపున మేయర్ కృతజ్ఞతలు తెలియజేశారు.యూజీడి ప్రాజెక్ట్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృఢ సంకల్పానికి నిదర్శనం. ఇది సాధారణ నిర్ణయం కాదని నగర ప్రజల సమస్యలను అర్థం చేసుకుని తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయమని కొనియాడారు. ఈ ప్రాజెక్టు అమలు ద్వారా వరంగల్ నగర రూపురేఖలు పూర్తిగా మారి పోతా యని నగరానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తూ అభివృద్ధి పనులను వేగవంతం చేయడం జరుగుతోందని మేయర్ తెలిపారు. అంతేకాకుండా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక సహాయ నిధుల కింద మునిసిపల్ కార్పొరేషన్ కు రూ. 25 కోట్లు, స్టేట్ ఫైనాన్స్ కమిషన్ కింద రూ.12 కోట్లు ఇటీవల మంజూరు చేయడం జరిగింది. అలాగే రాష్ట్ర బడ్జెట్ లో మునిసిపల్ శాఖకు కేటాయించిన నిధుల నుండి వరంగల్ నగరానికి మరిన్ని నిధులు అందించేందుకు ముఖ్యమంత్రి అంగీకరించడం అభినందనీయం అని అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తరువాత వరంగల్, హనుమకొండ నగరాల అభివృద్ధికి రూ. 225.53 కోట్లతో పలు పనులు చేపట్టడం జరిగింది. ఈ బడ్జెట్ వరంగల్ నగర అభివృద్ధికి ఒక దిక్సూచి లాంటిదని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రోత్సాహం, మార్గ దర్శకత్వంతో వరంగల్ నగరాన్ని రాష్ట్రంలోనే కాక దేశంలో కూడా ఒక ఆదర్శ నగరంగా తీర్చిదిద్దుతామని విశ్వసిస్తున్నాను. ఈ బడ్జెట్ కు ఆమోదం తెలిపినందుకు కార్పొరేటర్ల కు ధన్యవాదాలు తెలుపుతూ వరంగల్ నగర అభివృద్ధికి సహకరించాలని కోరారు. అనంతరం బల్దియా కమిషనర్ గా విశిష్ట సేవలు అందించి హన్మకొండ కలెక్టర్ గా ఇటీవల పదవి బాధ్యతలు చేపట్టిన కలెక్టర్ ను నగర మేయర్ డిప్యూటీ మేయర్ కార్పొరేటర్ లు శాలువాతో సత్కరించి పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సమావేశంలో హన్మకొండ జిల్లా కలెక్టర్, బల్దియా కమిషనర్ చాహత్ బాజ్ డిప్యూటీ మేయర్ రిజ్వాన శమిమ్ మసూద్, కార్పొరేటర్లు, బల్దియా వింగ్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# పెట్రోల్, డీజిల్‌కు కొరత లేదు

**మహా వరంగల్ బ్యూరో:** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో పెట్రోల్, డీజిల్ కొరత లేదని వరంగల్ సీపీ స్పష్టం చేశారు. బుధవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, సోషల్ మీడియాలో ప్రచారంలో ఉన్న వదంతుల వల్ల ప్రజలు ఆందోళనకు గురై ఒకేసారి పెద్ద సంఖ్యలో పెట్రోల్ బంకులకు వెళ్లి వాహనాల్లో ఫుల్ ట్యాంక్ నింపించు కుంటున్నారని తెలిపారు.దీంతో అనవసర రద్దీ ఏర్పడి సరఫరా వ్యవస్థకు అంతరాయం కలుగుతున్నదని పేర్కొన్నారు. వరంగల్ కమిషనరేట్ అన్ని పెట్రోల్ బంకుల్లో సరిపడా ఇంధన నిల్వలు ఉన్నాయని, సరఫరా నిరంతరంగా కొనసాగుతున్నదని చెప్పారు. ఎటువంటి కొరత పరిస్థితి లేదని స్పష్టం చేశారు. ప్రజలు అవసరానికి మించి ఇంధనం నిల్వ చేసుకోవద్దని, అలా చేయడం వల్ల ఇతరులకు ఇబ్బందులు కలుగుతాయని సూచించారు. సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాలను నమ్మకూడదని, నిర్ధారించని సమాచారాన్ని షేర్ చేయడం ద్వారా గందరగోళం సృష్టించవద్దని విజ్ఞప్తి చేశారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు పోలీసులు అప్రమత్తంగా ఉన్నారని, వదంతులు వ్యాప్తి చేయడం లేదా ప్రజలను భయభ్రాంతులకు గురిచేసే చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకుంటామని సీపీ హెచ్చరించారు.



# ఉపాధి హామీ పథకం పనుల పురోగతిపై సమీక్ష

**అసంపూర్తిగా ఉన్న పనులను త్వరగా పూర్తి చేయాలి.. వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద**



**మహా వరంగల్ బ్యూరో:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద చేపట్టిన పనుల్లో ఇంకా అసంపూర్తిగా ఉన్న వాటి పురోగతి పై జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద అధ్యక్షతన బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, కేంద్ర గ్రామీణ అభివృద్ధి శాఖ ఇటీవల జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం వివిధ శాఖల ఆధ్వర్యంలో చేపట్టిన పనుల్లో కొన్ని పూర్తికాకుండా ఉండటానికి గల కారణాలను సవివరంగా పరిశీలించారు. అసంపూర్తిగా ఉన్న పనులను మండలాల వారీగా గుర్తించి, వాటిని త్వరితగతిన పూర్తి చేయడానికి అవసరమైన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అలాగే, పనుల పూర్తి వివరాలను సమగ్రంగా సిద్ధం చేసి రాష్ట్ర కమిషనర్ కార్యాలయానికి పంపించాలని సూచించారు. ఉపాధి హామీ పనులను వివిధ శాఖల సమన్వయంతో, గ్రామాలలో ప్రజా ప్రతినిధుల సహకారంతో చేపట్టి, రైతులకు అనుకూలంగా ఉండే విధంగా అమలు చేసి వారి ఆర్థిక స్థితిని బలోపేతం చేయాలని కలెక్టర్ సత్య శారద సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి జి రామ్ రెడ్డి, సహాయ ప్రాజెక్టు డైరెక్టర్ శ్రీవాణి, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగానికి చెందిన ఇంజినీర్ ఇజ్జగిరి, జిల్లా పంచాయతీ అధికారి కల్పన, ఎంపీడీవోలు, ఉపాధి హామీ కార్యక్రమానికి సంబంధించిన అధికారులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.




## సీకేఎం ప్రసూతి ఆసుపత్రిని సందర్శించిన జిల్లా కలెక్టర్

**మహా వరంగల్ బ్యూరో:** వరంగల్ గిర్మాజీపేట లోని సీకేఎం ప్రసూతి ఆసుపత్రిని వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద బుధవారం సందర్శించారు.ఆసుపత్రిలో అందిస్తున్న వైద్య సేవలు, రోగులకు కల్పిస్తున్న సౌకర్యాలను కలెక్టర్ సమగ్రంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ వివిధ వార్డులను సందర్శించి, రోగులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన ఫిర్యాదు పెట్టెను పరిశీలించి, అందులో నమోదైన ఫిర్యాదులను సమీక్షించారు. రోగులకు అందిస్తున్న ఆహారం నాణ్యత పై ప్రత్యేక దృష్టి సారించిన కలెక్టర్, పౌష్టికాహారం సమయానికి అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా ఆసుపత్రిలో పరిశుభ్రత, ఔషధాల లభ్యత, వైద్య సేవల నాణ్యతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. అందిన ఫిర్యాదులపై తక్షణ చర్యలు తీసుకుని, రోగులకు మెరుగైన సేవలు అందించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ ఉమారాణి, జిల్లా వెనుకబడిన వర్గాల అభివృద్ధి అధికారి పుష్పలత, సీకేఎం ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ లక్ష్మీ దేవి, మహాత్మా గాంధీ ఆసుపత్రి వైద్యాధికారి హరిచంద్ర రెడ్డి, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

## డాక్టర్ వన్నాల వెంకటరమణకు ఘన సన్మానం



**మహా వరంగల్ బ్యూరో:** భారతీయ జనతా పార్టీ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న పండిత్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్ 2026 సమారోప్ (ముగింపు) కార్యక్రమం బుధవారం మండల అధ్యక్షురాలు కొండేటి అనిత అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ఇటీవల బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధిగా డాక్టర్ వన్నాల వెంకటరమణ నియమితులైన తర్వాత మొదటిసారి వర్ధన్నపేట మండలానికి విచ్చేసినందున వారిని మర్యాద పూర్వకంగా సన్మానించారు. ఈ సందర్భంగా పార్టీ కార్యకర్తలను నాయకులను ఉద్దేశించి డాక్టర్ వన్నాల వెంకటరమణ మాట్లాడుతూ భారతీయ జనతా పార్టీ జన సంఘం నుండి 1951 నుండి ఇప్పటివరకు దినదిన ప్రవర్తమానంగా ఎలా ఎదిగిందో అప్పటినుండి ఇప్పటివరకు పార్టీ ఎదుగుదలకు కృషి చేసిన నాయకులను గురించి కొనియాడారు. గతంలో బిజెపి నుండి మొట్టమొదటిసారి ప్రధానిగా బాధ్యతలు చేపట్టిన అటల్ బీహార్ వాజ్పేయి నుండి ఇప్పటి మన ప్రధాని నరేంద్ర మోడీ వరకు జాతీయ దృక్పథంతోని దేశమంతా అన్ని వర్గాల ప్రజలను కలుపుకుంటూ సమాన భవంతో చూస్తూ దేశాన్ని ఐక్యతగా ఉంచుతూ వికసిత్ భారత్ గా మార్చేందుకు 2047 వరకు ప్రపంచంలోనే మన దేశాన్ని అగ్రగామి దేశంగా నిలబెట్టేందుకు దేశాన్ని ఆర్థికంగా సామాజికంగా రాజకీయంగా కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి బన్న ప్రభాకర్, జిల్లా కార్యదర్శి రాయపురపు కుమారస్వామి, ప్రశిక్షణ అభియాన్ సహ కన్వీనర్ గార్ల పాటి మంజులారెడ్డి, ఎస్సీ మచ్చ జిల్లా ప్రధాన కార్యదర్శి మాదాసు రాజు, జిల్లా కౌన్సిల్ మెంబర్ మైసా రాములు, కట్రియాల సర్పంచ్ రాయపురం రమ్య, రాజు, నాంపల్లి యాకయ్య, తేజ నాయక్, అదుపరాజు, సోమిరెడ్డి, శ్రీరాముల సంపత్ ,నక్క రవి, గిరి మున్సిపాలిటీ ఎన్నికలలో కౌన్సిలర్ గా పోటీ చేసిన ప్రతి ఒక్కరు బూతు స్థాయి నుండి వివిధ స్థాయిలలో బాధ్యతలు గల కార్యకర్తలు పాల్గొన్నారు.

## భూమి కోల్పోయిన రైతులతో ఆర్బిట్రేషన్

**రైతుల సమస్యలు నేరుగా విన్న జిల్లా కలెక్టర్**

**మహా వరంగల్ బ్యూరో:** జిల్లా కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించిన ఆర్బిట్రేషన్ కార్యక్రమంలో వరంగల్ జిల్లా కలెక్టర్ డాక్టర్ సత్య శారద పాల్గొన్నారు.ఈ సందర్భంగా సంగెం మండలం లోని సంగెం, చింతలపల్లి గ్రామాలకు చెందిన 163కి గ్రీన్ ఫీల్డ్ నేషనల్ హైవే నిర్మాణంలో భూమి కోల్పోయిన రైతులతో ఆర్బిట్రేషన్ నిర్వహించారు. రైతుల సమస్యలు, అభ్యంతరాలను కలెక్టర్ స్వయంగా విని, తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) సంధ్యారాణి, వరంగల్ ఆర్డిఓ సుమ, సంగెం తహసీల్దార్ రాజ్ కుమార్,సంబంధిత శాఖల అధికారులు మరియు రైతులు పాల్గొన్నారు.





# శ్రీరామ నవమి గోడపత్రికల ఆవిష్కరణ కార్యక్రమం

**మహా వరంగల్ బ్యూరో:** ఓరుగల్లు నగరంలోని ప్రసిద్ధ శ్రీ గోవిందరాజుల గుట్ట ప్రాంగణం నందు శ్రీరామ నవమి స్వామివారి కల్యాణ మహోత్సవాల గోడపత్రికలను ఆలయ కార్యనిర్వాహణాధికారి అద్దంకి నాగేశ్వరరావు అధ్యక్షతన పాలక కమిటీ చైర్మన్ మరిపెల్లి సంజీవరావు సారధ్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా స్థానిక కార్పొరేటర్ చింతాకు అనిల్ కుమార్ ,మాజీ కార్పొరేటర్ జారితి రమేష్, స్థానిక నాయకులు చింతాకుల సునీల్, మీసాల ప్రకాష్, గోడపత్రికలను ఆవిష్కరించారు , ఈ సందర్భంగా గోవింద రాజస్వామి కళ్యాణ మహోత్సవాలు అష్టమి అనఘ దత్త వ్రతంలో మొదలుకొని అర్చక స్వాములు గుట్టపై స్వామి వారి నిత్య కైఖర్యం ప్రసాద నివేదనములతో మొదలుకొని స్వామివారికి అధ్యయన ఉత్సవాలు ఎంతో వైభవంగా కొనసాగు తున్నాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలు యాట సత్యనారాయణ గూడ శారద, ఉల్లపల్లి రామకృష్ణ, నాగరాజు, లక్ష్మణ్ స్వామి, అర్చక స్వాములు ఆలయ ప్రధాన అర్చకులు వారియోగుల శ్రీనివాస స్వామి, స్థానాచార్యులు వేణు స్వామి, శ్రీనివాస్ స్వామి, గోవిందు స్వామి, జగన్నాథం, వేణు స్వామి, కిరణ్ స్వామి, అరుణ్ స్వామి, హేమంత్ స్వామి, రామస్వామి, ప్రసాద్ స్వామి, మొదలగు అర్చక బృందం తో పాటు స్థానిక మహిళా మణులు ధనలక్ష్మి, అరుణ, వాణి ,సుజాత ,శ్రీదేవి ,స్వాతి ముదిరాజ్ రథసారథులు పరిష శ్రీనివాస్, ఆదినారాయణ, మహేష్, సురేష్ ,శ్రీను, అరుణ్, శివ వెంకట్, తదితరులు పాల్గొన్నారు.

# దేశ నిర్మాణంలో లైఫ్ సైన్సెస్‌దే కీలక పాత్ర

## డాక్టర్ అశోక్ కుమార్ చూబే, ఎమిరేటస్ ప్రొఫెసర్







**మహా వరంగల్ బ్యూరో:** కాకతీయ విశ్వవిద్యాలయంలో నిర్వహించిన జీవశాస్త్ర రంగంలోని పురోగతుల పై జాతీయ సదస్సు ముగింపు కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న చౌదరి చరణ్ సింగ్ యునివర్సిటీ, మీరట్ కి చెందిన ఎమిరేటస్ ప్రొఫెసర్ డా. అశోక్ కుమార్ చూబే విశిష్ట అతిథిగా హాజరయి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ నిర్మాణంలో జీవశాస్త్రాల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. ప్రస్తుత కాలంలో ఆరోగ్య పరిరక్షణ, ఆహార భద్రత, పర్యావరణ సమతుల్యత వంటి ముఖ్య అంశాలలో జీవశాస్త్ర పరిశోధనలు ప్రధాన పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. కొత్త వ్యాధుల నియంత్రణ, ఔషధ అభివృద్ధి, వ్యవసాయ రంగ అభివృద్ధి వంటి అంశాల్లో శాస్త్రవేత్తలు చేస్తున్న కృషి దేశ ప్రగతికి దోహదపడుతోందని చెప్పారు. వాతావరణ మార్పుల ప్రభావం పెరుగుతున్న నేపథ్యంలో జీవశాస్త్ర పరిశోధనలు మరింత అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రకృతి వనరుల సంరక్షణతో పాటు జీవ వైవిధ్యాన్ని కాపాడటంలో శాస్త్రీయ దృక్పథం అవసరమని సూచించారు. విద్యార్థులు మరియు యువ శాస్త్రవేత్తలు పరిశోధనలపై ఆసక్తి పెంచుకుని సమాజానికి ఉపయోగపడే ఆవిష్కరణల వైపు అడుగులు వేయాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సు ద్వారా శాస్త్రవేత్తలు, అధ్యాపకులు, విద్యార్థుల మధ్య జ్ఞాన మార్పిడి జరిగి కొత్త ఆలోచనలకు మార్గం సుగమమైందని తెలిపారు. డీన్ ఫ్యాకల్టీ ఆఫ్ సైన్సెస్ ప్రో హనుమంతు, యూజీసీ కో ఆర్డినేటింగ్ ఆఫీసర్ ప్రో మల్లికార్జున రెడ్డిలు మాట్లాడుతూ, కాకతీయ యూనివర్సిటీ జంతు శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన జాతీయ సదస్సు ద్వారా లైఫ్ సైన్సెస్ విభాగాల విద్యార్థుల్లో పరిశోధన పట్ల ఆసక్తి రగిలించిందని అన్నారు. జాతీయ సదస్సు నిర్వాహక కార్యదర్శి ప్రొఫెసర్ మామిడాల ఇస్తారి, ప్రో ఈసం నారాయణ మాట్లాడుతూ జీవశాస్త్రాలు ప్రపంచవ్యాప్తంగా కీలక మార్పులకు దారి తీస్తున్నాయని, వాతావరణ మార్పులు, కొత్త వ్యాధులు, ఆహార భద్రత వంటి సవాళ్లను ఎదుర్కొనేందుకు ఈ రంగం అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 155 పరిశోధనా పత్రాలు అందినట్లు తెలిపారు. ఈ సదస్సు ద్వారా శాస్త్రవేత్తలు, పరిశోధకులు పరస్పర జ్ఞాన మార్పిడి చేసుకుని కొత్త ఆవిష్కరణలకు దోహదపడతారని ఆశాభావం వ్యక్తం చేశారు. త్వరలో పూర్తి స్థాయి పరిశోధన పత్రాలతో ఐ.ఎస్.బీ.ఎన్ ప్రొసీడింగ్స్ విడుదల చేస్తామని అన్నారు. పరిశోధనా పత్రాలు సమర్పించిన వారిలో నళిని జగితిప్, శ్రీనాథ్ లు బెస్ట్ పోస్టర్ ప్రజెంటేషన్ అవార్డును అందుకోగా, డా రేణుక, ఎం.డీ. సానోబార్, డా నందితా అశోక్ మోరే లు బెస్ట్ ఓరల్ ప్రజెంటేషన్ అవార్డ్ లు కైవసం చేసుకున్నారు. ముగింపు సమావేశానికి జంతుశాస్త్ర విభాగ అధిపతి ప్రో. వెంకయ్య అధ్యక్షత వహించగా, ప్రో. షమిత, డా సుజాత, డా ఖనీజ్ ఫాతిమా, డా గోపీనాథ్, ప్రో. నరసింహ రెడ్డి, ప్రో ప్రసాద్, డా. ఎన్. రాజు, డా చంద్ర శేఖర్ లు పాల్గొన్నారు.

# జర్నలిస్ట్ పూజారి విజయ్ అదృశ్యం

**హన్మకొండ మహా:** హనుమకొండ నగరం లోని కృష్ణ కాలనీకి చెందిన సీనియర్ జర్నలిస్ట్ పూజారి విజయ్ కుమార్ అదృశ్య మయ్యారు. వరంగల్ నగరపాలక సంస్థ ఇండోర్ స్టేడియంలో క్రీడాకారులతో కలిసి మెలిసి ఉన్న ఆయన మంగళవారం నుంచి కనిపించడం లేదు. మంగళవారం ఉదయం 10:30 సమయంలో ఆయన సెల్ స్విచ్ ఆఫ్ అయిందని బంధుమిత్రులు, స్నేహితులు, కుటుంబ సభ్యులు అన్ని చోట్ల వెతికిన ఆయన ద్విచక్ర వాహనం టీఎస్ 03 ఈయూ 2731 బ్లూ కలర్ గ్లామర్ , విజయ్ కుమార్ ఆచూకీ లభించలేదు. బుధవారం ఉదయం ఈ విషయం పై కుటుంబ సభ్యులు కాకతీయ యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు. జర్నలిస్టు విజయ్ కుమార్ ఆచూకీ లభించినట్లయితే అతని తమ్ముడు పూజారి శ్రీనివాస్ సెల్ నెంబర్ 9652988566 కు సమాచారం ఇవ్వాలని ఆయన సతీమణి పూజారి సుజాత విజ్ఞప్తి చేశారు. తన భర్త అదృశ్యం వెనుక ఉన్న మిస్టరీని ఛేదించాలని పోలీస్ అధికారులకు ఆమె విజ్ఞప్తి చేశారు.





# చికెన్ షాపులు బంద్

## పౌల్ట్రీ కంపెనీల విధానాలపై చికెన్ వ్యాపారుల ఆందోళన

**మహా వరంగల్ బ్యూరో :** పౌల్ట్రీ కంపెనీల విధానాలకు వ్యతిరేకంగా తెలంగాణ రాష్ట్రంలో చికెన్ వ్యాపారులు ఆందోళనకు దిగుతున్నారు. తక్కువ మార్జిన్ కారణంగా నష్టాలు ఎదుర్కొంటు న్నామని పేర్కొంటూ, ఏప్రిల్ 1 నుంచి రాష్ట్రవ్యాప్తంగా చికెన్ షాపులను బంద్ చేయాలని నిర్ణయించారు. పౌల్ట్రీ కంపెనీలు ఇచ్చే మార్జిన్ సరిపోవడం లేదని వ్యాపారులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో వ్యాపారం నష్టాల్లోకి వెళ్లే పరిస్థితి ఏర్పడిందని వారు చెబుతున్నారు. చికెన్ ధరలు పెరిగినా, మధ్యవర్తుల విధానాల వల్ల తాము లాభపడడం లేదని వ్యాపారులు వాపోతున్నారు. తమ సమస్యలను పౌల్ట్రీ కంపెనీలకు పలుమార్లు తెలియ జేసినప్పటికి సరైన స్పందన రాలేదని ఆరోపిస్తున్నారు. ఈ నేపథ్యంలో తమ డిమాండ్లు పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా నిరవధికంగా చికెన్ షాపులను మూ సివేస్తామని హెచ్చరించారు. ఏప్రిల్ 1 నుంచి బంద్ ప్రారంభమవుతుంద ని బుధవారం ప్రకటించారు. చికెన్ షాపుల బంద్ వల్ల వినియోగదారుల పై కూడా ప్రభావం పడే అవకాశం ఉందని భావిస్తున్నారు. ప్రభుత్వం మధ్యవర్తిత్వం వహించి సమస్యను పరిష్కరించాలని వ్యాపారులు కోరుకుంటున్నారు.



# పన్ను వసూళ్లలో బల్దియా సిబ్బంది తిప్పలు

## పన్ను అడిగితే మున్సిపల్ సిబ్బందిపై దాడి

## మట్టెవాడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

**మహా వరంగల్ బ్యూరో:** వరంగల్ నగరంలోని కొత్తవాడ ప్రాంతంలో మున్సిపల్ సిబ్బంది పై దాడి జరిగిన ఘటన వెలుగులోకి వచ్చింది. స్థానికంగా నివసిస్తున్న బొట్ల శ్రవణ్ అనే వ్యక్తిపై ఉన్న ఇంటి పన్ను విషయం పై అతని తండ్రి ఆశీర్వాదం ఇంటికి చెందిన రూ.12 వేల హౌస్ ట్యాక్స్ బకాయిలు ఉండటంతో, మున్సిపల్ సిబ్బంది వసూళ్ల కోసం అక్కడికి వెళ్లారు. ఈ సందర్భంగా ఆశీర్వాదం సిబ్బంది పై ఆగ్రహం వ్యక్తం చేస్తూ అసభ్యకరంగా మాట్లాడుతూ సిబ్బంది పై దుర్భాషలాడినట్లు తెలిసింది. మహిళా ఉద్యోగిని సైతం అవమానకరంగా దూషించడంతో పాటు, మరో ఉద్యోగి పై దాడికి పాల్పడ్డినట్లు సిబ్బంది తెలిపారు. ఈ ఘటన పై మున్సిపల్ సిబ్బంది ఉన్నతాధికారులకు సమాచారం అందించగా, పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. దీంతో బాధిత సిబ్బంది మట్టేవాడ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు తెలిసింది.

# జాగృతి పోలీస్ కళా బృందంచే అవగాహన కార్యక్రమం

**మహా వరంగల్ బ్యూరో:** వరంగల్ నగరంలోని మిల్స్ కాలనీ పరిధిలో జాగృతి పోలీస్ కళా బృందం ఆధ్వర్యంలో పలు సామాజిక అంశాల పై స్థానిక ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. మిల్స్ కాలనీ ఇన్స్పెక్టర్ బొల్లం రమేష్ నేతృత్వంలో ఈ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్య ప్రాధాన్యత, సీసీ టీవీ కెమెరాల ఏర్పాటు అవసరం, గంజాయి, డ్రగ్స్ వాడకం వల్ల కలిగే సమస్యలు అలాగే క్రయ విక్రయాలు, సైబర్ నేరాల పై అవగాహన, మూఢనమ్మకాలు, రోడ్డు భద్రతా నియమాలు పాటించకుండా కలిగే ప్రమాదాలు, ట్రాఫిక్ నిబంధనలు వంటి అంశాల పై కళా బృందం ప్రదర్శనల ద్వారా ప్రజలకు వివరించారు. ప్రజలు చట్టాల పై అవగాహన కలిగి ఉండాలని, సమాజంలో బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని ఇన్స్పెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో కళా బృందం వారు వివిధ అంశాల పై పాడిన పాటలు స్థానికులను ఎంత గానో ఆకట్టుకున్నాయి.

